
# అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people

శుక్రవారం 24, జూలై 2026 | సంపుటి : 03 | సంచిక : 155 | పేజీలు : 05 | వెల ₹5

మూడు దశల్లో మామునూరు విమానాశ్రయం నిర్మాణం

## రూ.520 కోట్లతో ఎయిర్‌పోర్ట్

- హనుమకొండలో ప్రీ-బిడ్ సమావేశం
- రూ. 21 కోట్లతో తొలిదశ టెండర్లు..
- ఆసక్తి చూపిన 6 ప్రముఖ సంస్థలు

2



## డ్రగ్స్‌కు స్వస్తి చెప్దాం

- ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దాం
- 'సే నో టు డ్రగ్స్' 2కే రన్‌ను ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ
- టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ

2



## రోడ్లపై మృత్యుకూపాలకు చెక్

- బ్లాక్ స్పాట్లపై వరంగల్ సీపీ శ్వేత 'స్పెషల్ ఫోకస్'
- ఎన్ హెచ్-163 మార్గంలో అధికారులతో కలసి గ్రౌండ్ లెవెల్ రీసెర్చ్

4

## సీసీఎస్ పోలీసుల ఆకస్మిక దాడి

- కిరాణం, జనరల్ స్టోర్లలో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం
- రూ.1,96,430 విలువైన అంబర్, ఆర్ఆర్, మీరాజ్ ఉత్పత్తులు జప్తు

2



# కేటీఆర్ కొందరివాడేనా..?


## బీఆర్ఎస్ పార్టీకి కొంతమంది జర్నలిస్టులే అవసరమా..?

- వరంగల్ ప్రెస్ అండ్ మీడియాలో వర్గీకరణ..!
- పెద్ద, మధ్య, చిన్న పేపర్లుగా తారతామ్యాల సృష్టి
- తాబేదార్లు చెప్పినట్లే నడుచుకుంటున్న పీఆర్వోలు, లీడర్లు
- పబ్లిక్ లీడర్ చిట్‌చాట్‌ను సైతం ప్రైవేటు ప్రొగ్రాంలా నిర్వహణ
- నిజాలు రాసేటోళ్ల కన్నా.. తాబేదార్లే ముఖ్యమా..?
- స్త్రీం ముసుగులో జోకొడుతున్నదెవరు..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యటనపై కొంతమందికే సమాచారం
- చిట్‌చాట్‌కు సైతం వారికే ఆహ్వానం.. ఇలా అయితే ఎలా సారూ..?
- అర్థం చేసుకోకుంటే ఆగమవడం గ్యారంటీ అంటూ మీడియా వర్గాల్లో చర్చ

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరంగల్ పర్యటనలో మీడియాపై పార్టీ నిర్వాహకులు అనుసరించిన విధానంపై మీడియా అండ్ ప్రెస్ వర్గాల్లో కొత్త చర్చకు దారితీస్తోంది. బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యటనపై..చిట్‌చాట్ నిర్వహణపై కొంతమందికే సమాచారం ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ జిల్లా నాయకత్వం అనుసరించిన తీరుపై స్థానిక జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కేవలం కొద్దిమందికే పార్టీ కార్యక్రమాలను పరిమితం చేస్తూ, నాయకులు అనుసరిస్తున్న ఏకపక్ష ధోరణిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అసలు కేటీఆర్ కేవలం కొందరివాడేనా, లేక బీఆర్ఎస్ పార్టీకి కేవలం కొంతమంది ఎంపిక చేసిన జర్నలిస్టులు మాత్రమే అవసరమా? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

- అక్షరదర్బార్, హనుమకొండ

5






# డ్రగ్స్‌కు స్వస్తి చెప్దాం

- ఉజ్వల భవిష్యత్తును నిర్మిద్దాం
- 'సే నో టు డ్రగ్స్' 2కే రన్‌ను ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ
- టీఎస్‌జేయూ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ

**అక్షరదర్బార్, హనుమకొండ:**

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని రాష్ట్ర అటవి, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జేయూ) హనుమకొండ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం హనుమకొండ కలెక్టరేట్ నుంచి కాళోజీ జంక్షన్ వరకు నిర్వహించిన 2కే రన్‌కు మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ డ్రగ్స్ వ్యతిరేక 2కే రన్‌ను ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న, హనుమకొండ అదనపు కలెక్టర్ రవి, వరంగల్ డీసీపీ ధారా కవితతో కలిసి మంత్రి కొండా సురేఖ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ అనంతరం అక్కడకు చేరిన అధికారులు, విద్యార్థులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలతో కలిసి మంత్రి "సే నో టు డ్రగ్స్" అని ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం నింపేలా ప్లకార్డులతో హోరెత్తించారు.

### తరలివచ్చిన అధికారులు, విద్యార్థులు

మాదకద్రవ్యాల నివారణే లక్ష్యంగా జరిగిన ఈ అవగాహన ర్యాలీలో విద్యార్థులు, యువత, జర్నలిస్టులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నార్కోటిక్స్ డీఎస్పీ రమేష్, డిటిఓ జనార్ధన్ రెడ్డి, ఎంవీఐ కిరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, డీపీఆర్ ఓ అయుబ్ అలీ, కుడా మాజీ చైర్మన్ సుందర్ రాజ్ యాదవ్, (టీఎస్ జేయూ) బాధ్యులు, ఎన్ సీసీ క్యాడెట్లు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సీసీఎస్ పోలీసుల ఆకస్మిక దాడి

- కిరాణం, జనరల్ స్టోర్లలో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు స్వాధీనం
- రూ.1,96,430 విలువైన అంబర్, ఆర్ఆర్, మీరాజ్ ఉత్పత్తులు జప్తు

**అక్షరదర్బార్, భూపాలపల్లి :**

ప్రజారోగ్యానికి హాని కలిగించే నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ విక్రయాలపై భూపాలపల్లి జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు గురువారం సీసీఎస్ పోలీసులు భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు.

ఈ తనిఖీల్లో భాగంగా పట్టణంలోని చాముండా జనరల్ స్టోర్స్, దుర్గా జనరల్ స్టోర్స్, మరియు పవన కృష్ణ కిరాణం దుకాణాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ పొగాకు ఉత్పత్తుల నిల్వలను పోలీసులు బయటపెట్టారు.

### రూ.1.96 లక్షల ఉత్పత్తులు జప్తు

దుకాణాల్లో అక్రమంగా విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన అంబర్, ఆర్ఆర్, అనార్, జేకే, మీరాజ్ తదితర నిషేధిత పొగాకు ఉత్పత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సరుకు మొత్తం విలువ రూ.1,96,430 ఉంటుందని సీసీఎస్ పోలీసులు తెలిపారు. అనంతరం సదరు ఉత్పత్తులతో పాటు నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓకి అప్పగించారు.

### అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ... ప్రజారోగ్యంతో చెలగాటమాడే నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులను నిల్వ చేసినా, రవాణా చేసినా లేదా విక్రయించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లాలో ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో జరిగే అక్రమ విక్రయాల గురించి పోలీసులకు సమాచారం ఇచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# గంజాయి రహిత సమాజమే లక్ష్యం

- నార్కోటిక్ డాగ్‌తో సీసీఎస్ పోలీసుల ఆకస్మిక తనిఖీలు
- గంజాయి ముఠాలపై కఠిన నిఘా ఉంచామని జిల్లా ఎస్పీ హెచ్చరిక



అక్షరదర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి జిల్లాలో గంజాయిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం సీసీఎస్ పోలీసులు నార్కోటిక్ డాగ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్, కాకతీయ కాలనీ, జంగేడు, ఖాసింపల్లి ప్రాంతాల్లో గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్న వ్యక్తులు, వినియోగదారుల ఇళ్లు, పరిసర ప్రాంతాలను పోలీసులు జల్లెడ పట్టారు.

– చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ఈ తనిఖీల సందర్భంగా పోలీసులు గంజాయి నిందితులు, వినియోగదారులు మరియు వారి కుటుంబ సభ్యులతో నేరుగా మాట్లాడారు. గంజాయి విక్రయం, రవాణా, నిల్వ మరియు వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పూర్తిగా దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. గంజాయి సేవిస్తున్న వారిపై, విక్రయిస్తున్న వారిపై నిరంతరం కఠిన నిఘా కొనసాగుతోందని తెలిపారు. భవిష్యత్తులో మళ్లీ గంజాయి సంబంధిత నేరాల్లో పాల్గొంటే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

### ప్రజల సహకారం ఖచ్చితంగా అవసరం

జిల్లాలో మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా మరియు అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని సీసీఎస్ పోలీసులు తెలిపారు. గంజాయి రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం ఏమైనా తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ, జిల్లా పోలీసులకు గానీ సమాచారం ఇచ్చి సహకరించాలని ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులపై లాఠీచార్జ్ అప్రజాస్వామికం


## కాకతీయ వర్సిటీ ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు




అక్షరదర్బార్, హనుమకొండ: నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహించి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ పేపర్ లీక్ తర్వాత ఆందోళనతో మరణించిన విద్యార్థులకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, భవిష్యత్తులో ఆరోపణలకు తావు లేకుండా పరీక్షలు పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, సంసద్ ముట్టడికి బయలుదేరిన విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేయటాన్ని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు ఖండిస్తూ కళాశాల ప్రాంగణంలో నిరసన తెలియజేశారు. జూలై 20న పార్లమెంటు ముట్టడికి బయలుదేరిన విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేయటం వలన వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడటమే కాకుండా ఒక విద్యార్థిని కూడా మరణించటానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని అధ్యాపకులు అభిప్రాయపడినారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ కావటం, సీబీఎస్ఇ పరీక్షల మూల్యాంకనంలో తప్పులు దొర్లటం, క్యూట్ పరీక్ష నిర్వహణలో లోపాలు తలెత్తడంతో దరిదాపు 55 లక్షల మంది విద్యార్థులు ఆందోళనకు గురైనారు కాబట్టి ప్రభుత్వం ఈ వైఫల్యాలకు బాధ్యత వహించి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని ప్రభుత్వం ఇప్పటివరకు విద్యార్థులకు భరోసా ఇవ్వలేకపోయిందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో వైఫల్యాలకు బాధ్యత వహించి భవిష్యత్తులో పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై లాఠీచార్జి చేసి విచక్షణ రహితంగా కొట్టిన పోలీసులపై చర్యలు చేపట్టాలి జరిగిన ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులుడాక్టర్ తిరునహరి శేషు,డాక్టర్ చింతం ప్రవీణ్ కుమార్, డాక్టర్ శ్రీధర్ కుమార్ లోద్, డాక్టర్ కొంగ వీరస్వామి, డాక్టర్ కనకయ్య, డాక్టర్ వెన్నంపల్లి విజయకుమార్, డాక్టర్ సునీత, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ భక్కి శ్రీనివాస్, డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ రవీందర్, డాక్టర్ హరి శంకర్, డాక్టర్ నవీన్, డాక్టర్ వావిళ్ళ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.520 కోట్లతో ఎయిర్‌పోర్ట్

- మూడు దశల్లో మామునూరు విమానాశ్రయం నిర్మాణం
- హనుమకొండలో ప్రీ-బిడ్ సమావేశం
- రూ. 21 కోట్లతో తొలిదశ టెండర్లు..
- ఆసక్తి చూపిన 6 ప్రముఖ సంస్థలు



**అక్షరదర్బార్, వరంగల్ :**

ఓరుగల్లు ప్రజల దశాబ్దాల కల నెరవేరే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. చారిత్రక వరంగల్ నగరానికి మహర్దశ చేకూరుస్తూ మామునూరు ఎయిర్‌పోర్ట్ నిర్మాణ పనులు పట్టాలెక్కుతున్నాయి. మొత్తం రూ.520 కోట్ల భారీ వ్యయంతో మూడు దశల్లో ఈ విమానాశ్రయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు రవాణా, మౌలిక వసతుల శాఖ కసరత్తు పూర్తి చేసింది. ఈ నిర్మాణ ప్రక్రియలో భాగంగా గురువారం హనుమకొండలో అత్యంత కీలకమైన 'ప్రీ–బిడ్' సమావేశం నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), రాష్ట్ర మౌలిక వసతుల శాఖ అధికారుల సమక్షంలో జరిగిన ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి ఆరుగురు ప్రముఖ బిడ్డర్లు (కాంట్రాక్టర్లు) హాజరై, టెండర్ నిబంధనలు, పనుల వివరాలపై చర్చించారు.

### మూడు దశల నిర్మాణ ప్రణాళిక ఇదే

ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని అధికారులు మూడు ప్రధాన దశలుగా వర్గీకరించారు. రూ.21 కోట్లతో మొదటి విడతలో విమానాశ్రయ స్థలానికి భద్రత కల్పిస్తూ సమగ్ర ప్రహరీ గోడ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. రెండో దశ రూ.203.49 కోట్లతో ఎయిర్‌పోర్ట్ ప్రధాన మౌలిక వసతులపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఆధునిక టెర్మినల్ భవనం, అత్యవసర సేవల కోసం ఫైర్ స్టేషన్, పెరిమీటర్ రోడ్డు, ఎమర్జెన్సీ రోడ్డు, లింకు టాక్సీ వే, ఐసోలేషన్ బే, సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థలను నిర్మించనున్నారు. మూడో దశ రూ.297 కోట్లతో చివరి దశలో రన్ వే విస్తరణ, నావిగేషన్ పరికరాల అమరిక, ఇతర అధునాతన సాంకేతిక పనుల కోసం రూ.297 కోట్లతో త్వరలోనే టెండర్లు పిలవనున్నారు.

### బిడ్డర్ల నుంచి విశేష స్పందన

హనుమకొండలో జరిగిన ప్రీ–బిడ్ సమావేశంలో పనుల నాణ్యత, పూర్తి చేయాల్సిన గడువు, సాంకేతిక అంశాలపై అధికారులు స్పష్టత ఇచ్చారు. ప్రసిద్ధ నిర్మాణ సంస్థలు ఈ ప్రాజెక్టుపై ఆసక్తి చూపడంతో త్వరలోనే టెండర్ల ప్రక్రియ ముగిసి, భూమిపై పనులు ప్రారంభం కానున్నాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే వరంగల్ కేంద్రంగా పర్యాటకం, ఐటీ, టెక్స్‌టైల్ రంగాలు మరింత వేగంగా అభివృద్ధి చెందుతాయని స్థానికులు, వ్యాపార వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

# ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తప్పవు

- పరకాల ఏడీఏ అవినాష్ వర్మ
- శాయంపేట మండలంలో ఎరువుల దుకాణాల తనిఖీ

**అక్షరదర్బార్, శాయంపేట :**

పరకాల వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) అవినాష్ వర్మ శాయంపేట మండలంలో పర్యటించి ఎరువుల విక్రయ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర (ఎంఆర్పీ) కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయించరాదని డీలర్లను హెచ్చరించారు. స్టాక్ రిజిస్టర్లు, విక్రయ రికార్డులు, బిల్లులు, లైసెన్సులు, స్టాక్ బోర్డులను నిబంధనల ప్రకారం నిర్వహిస్తూ ఉండాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎరువుల నియంత్రణ ఉత్తర్వులు (ఎఫ్ సీఓ) ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



# వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

- శాయంపేట ఏఓ ప్రియదర్శిని
- రైతులతో శాయంపేట వ్యవసాయ అధికారుల సమావేశం

**అక్షరదర్బార్, శాయంపేట :**

శాయంపేట మండలంలోని కొప్పుల, మైలారం, వసంతాపూర్ గ్రామాల్లో రైతులతో వ్యవసాయ అధికారులు సమావేశం నిర్వహించారు. శాయంపేట మండల వ్యవసాయ అధికారి మార్క ప్రియదర్శిని మాట్లాడుతూ... ప్రస్తుత ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, వర్షాలకు మధ్య ఎక్కువ రోజుల విరామం వచ్చే అవకాశం ఉందన్నారు. రాబోయే రోజుల్లో విద్యుత్ సరఫరాపై కూడా ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున రైతులు వరిపైనే ఆధారపడకుండా తక్కువ నీటి అవసరమున్న ప్రత్యామ్నాయ పంటలైన పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, మెట్ట పంటలను సాగు చేయాలని సూచించారు. అనంతరం పెసర, ఇతర పప్పుధాన్య పంటల క్షేత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు పాల్గొన్నారు.



## రేషన్ బియ్యం అక్రమంగా

# నిల్వ చేస్తే కఠిన చర్యలు

- చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్
- ముచినపర్తిలో 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం
- గౌరిశెట్టి సత్యనారాయణ అనే వ్యక్తిపై కేసు నమోదు



**అక్షరదర్బార్, చిట్యాల :**

చిట్యాల మండల పరిధిలోని ముచినపర్తి గ్రామానికి చెందిన గౌరిశెట్టి సత్యనారాయణ ఇంట్లో చట్టవిరుద్ధంగా నిల్వ ఉంచిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని చిట్యాల పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చిట్యాల ఎస్ఐ పోచంపల్లి సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పేద ప్రజలకు పంపిణీ చేయాల్సిన ప్రభుత్వ సబ్సిడీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసినా, కొనుగోలు చేసినా లేదా విక్రయించినా చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రోడ్లపై మృత్యుకూపాలకు చెక్

- బ్లాక్ స్పాట్లపై వరంగల్ సీపీ శ్వేత 'స్పెషల్ ఫోకస్'
- ఎన్ హెచ్-163 మార్గంలో అధికారులతో కలసి గ్రౌండ్ లెవెల్ రీసెర్చ్

**అక్షరదర్బార్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుస రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత, రంగంలోకి దిగారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న 'బ్లాక్ స్పాట్ల'పై ప్రత్యేక దృష్టి సారించిన సీపీ, గురువారం ఇతర శాఖల ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. నేషనల్ హైవే–163 పరిధిలోని హనుమకొండ– హైదరాబాద్ ప్రధాన రహదారిపై కరుణాపురం నుంచి పెంబర్తి వరకు అత్యంత ప్రమాదకరంగా మారిన 10కి పైగా బ్లాక్ స్పాట్లను నేరుగా వెళ్లి పర్యవేక్షించారు. పోలీస్, నేషనల్ హైవే అథారిటీ (ఎన్ హెచ్ ఏఐ), రోడ్డు రవాణా శాఖ (ఆర్టీఏ), ఎక్సైజ్ శాఖల అధికారులతో కలిసి రోడ్డు నిర్మాణ లోపాలు, ప్రమాదాలకు గల కారణాలను క్షుణ్ణంగా పరిశీలించారు.



### రేచీకటికి చెక్.. ప్రాణాలకు రక్షణ

గ్రామాలకు వెళ్లే రోడ్ల అనుసంధాన ప్రాంతాలు, డివైడర్ ఓపెనింగ్స్ వద్ద రాత్రి వేళల్లో స్పష్టంగా కనిపించేలా హై-విజిబిలిటీ లైటింగ్ ఏర్పాటు చేయాలి. డ్రైవర్లను అప్రమత్తం చేసేందుకు బ్లాక్ స్పాట్ల వద్ద భారీ సైన్ బోర్డులు, రిఫ్లెక్టివ్ స్టిక్కర్లు, దిశా నిర్దేశక బోర్డులు అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలి. హైవే వెంట ఉన్న మద్యం దుకాణాల వద్ద వాహనాలు రోడ్డుపై ఆగకుండా పార్కింగ్‌ను క్రమబద్ధీకరించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.

### స్థానికుల వినతి.. సీపీ సానుకూల స్పందన

పరిశీలన సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను సీపీ తెలుసుకున్నారు. కరుణాపురం వద్ద రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, 'ఫుట్ ఓవర్ బ్రిడ్జ్' నిర్మించాలని స్థానికులు కోరగా... వెంటనే స్పందించినసీపీ,అవసరమైనప్రాంతాల్లోఫుట్ ఓవర్‌బ్రిడ్జిలనిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎన్ హెచ్ ఏఐ అధికారులకు

## '108' అంబులెన్స్ సేవలు పరిశీలన

హైవేపై ప్రమాద బాధితులకు త్వరితగతిన వైద్యం అందేలా అందుబాటులో ఉంచిన అత్యవసర అంబులెన్స్‌ను సీపీ తనిఖీ చేశారు. అందులోని అత్యవసర వైద్య పరికరాలను, సిబ్బంది స్పందించే తీరును అడిగి తెలుసుకున్నారు. "గోల్డెన్ అవర్"లో ప్రాణాలు కాపాడేలా సిబ్బంది నిరంతరం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ట్రాఫిక్ అదనపు డీసీపీ రాయల ప్రభాకర్ రావు, ఘనపూర్ ఏసీపీ భీంశర్మ, ఎన్ హెచ్ ఏఐ పీడీ భరద్వాజ్, మేనేజర్ లింగయ్య, ఇన్‌స్పెక్టర్లు వేణు, చేరాలు, ఎస్ఐలు నవీన్ కుమార్, శ్రవణ్ కుమార్, ఆర్ఎస్ఐ నవీన్ తో పాటు ఆర్టీఏ, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్‌గా నీటిపారుదల శాఖ స్థలం

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్
- నిద్రపోతున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది
- ఆ స్థలాన్ని పాఠశాల ఆటస్థలంగా అభివృద్ధి చేయాలి



**అక్షరదర్బార్, నర్సంపేట**

నర్సంపేట పట్టణంలోని శిథిలావస్థలో ఉన్న నీటిపారుదల శాఖ కార్యాలయ స్థలంలో చెత్తను విచ్చలవిడిగా వేస్తూ, దాన్ని డంపింగ్ యార్డ్‌ను తలపించేలా మార్చారని బీజేపీ నర్సంపేట పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణ బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల స్థలాలను డంపింగ్ యార్డులుగా మారుస్తున్నా మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం దారుణమన్నారు. పక్కనే ఉన్న హనుమాన్ దేవాలయ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజలు, బాటసారులు వర్షాకాలంలో ఈ చెత్త నుంచి వెలువడుతున్న దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దోమలు, ఈగలు పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి రోగాలు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. మున్సిపల్ సిబ్బంది, కమిషనర్ స్పందించకపోవడాన్ని తప్పుపట్టారు. అక్రమార్కుల నుంచి ఆ స్థలాన్ని రక్షించి చుట్టూ ఫెన్సింగ్ వేయాలని, చెత్తను తొలగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆటస్థలం లేక ఇబ్బంది పడుతున్న హనుమాన్ దేవాలయ పాఠశాల విద్యార్థుల కోసం ఈ స్థలాన్ని ప్లేగ్రౌండ్‌గా అభివృద్ధి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేశ వ్యతిరేక శక్తులకు యువత దూరంగా ఉండాలి

- విద్యార్థుల అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకోవద్దు
- బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ

**అక్షరదర్బార్, శాయంపేట :**



ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో కొంతమంది విద్యార్థుల పేరుతో దేశ వ్యతిరేక భావజాలాన్ని ప్రోత్సహిస్తూ, సమైక్యతను దెబ్బతీయాలనే ఉద్దేశంతో చేపట్టిన కార్యక్రమాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ శాయంపేట మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ అన్నారు. విద్యార్థుల అమాయకత్వాన్ని అడ్డం పెట్టుకుని కొందరు రాజకీయ స్వార్థంతో దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమన్నారు. దేశాన్ని ముక్కలుగా చేయాలనే నినాదాలను, విదేశీ శక్తుల కుట్రలను ప్రజలు అంగీకరించరన్నారు. యువత దేశభక్తి, రాజ్యాంగ విలువలను కాపాడుతూ దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు

# వేగవంతంగా పూర్తి చేయాలి

## పీవీ విజ్ఞాన కేంద్రం పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**అక్షరదర్బార్, భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గురువారం పరిశీలించారు. మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు స్వగ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రం పనులు తుది దశకు చేరడంతో క్షేత్ర స్థాయిలో జిల్లా కలెక్టర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. విజ్ఞాన కేంద్రంలోని ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, ప్రాంగణంలో నాటిని మొక్కలు, నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు, తాగునీటి సౌకర్యాలు, నిర్వహణను కలెక్టర్ స్వయంగా పరిశీలించి వాటికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుది దశకు చేరుకున్న పీవీ విజ్ఞాన కేంద్రం అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కేంద్రం నిర్వహణ మెరుగ్గా ఉండాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సృజన, కుడా సీపీవో అజిత్ రెడ్డి, డీఈ రఘు, జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఇతర అధికారులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.



# కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

- సిబ్బందితో సమావేశమైన ఎస్పీ సంకీర్త్

అక్షరదర్బార్, చిట్యాల : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించే లక్ష్యంతో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గురువారం చిట్యాల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, శాంతిభద్రతల పరిరక్షణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీసు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ మల్లేష్, ఎస్సై పోచంపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బీఎంఎస్ 72వ ఆవిర్భావ వేడుకలు

- కార్మికులకు బీమా, గృహాలు కల్పించాలి

**అక్షరదర్బార్, పరకాల :**

భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం పరకాల, నడికూడ మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించారు. భవన నిర్మాణ ఇతర రంగాల రాష్ట్ర కార్యదర్శి అడగాని జనార్దన్ రావు, నడికూడ మండల అధ్యక్షుడు తాళ్ల పున్నం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేపట్టి కార్మికుల హక్కుల పరిరక్షణకు సంఘం చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా అడగాని జనార్దన్‌రావు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సాయం, ఆరోగ్య బీమా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని కార్మికులకు గృహాలు, వారి పిల్లల విద్యకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు మండల కేంద్రాల్లో కార్మిక భవనాలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, సంక్షేమ పథకాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



# నర్సంపేట, ఇనుగుర్తి గురుకులాల్లో అవస్థలు

- సొంత భవనాలు ఏర్పాటు చేసి ఖాళీలు భర్తీ చేయాలి

**అక్షరదర్బార్, నర్సంపేట :**



సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో నెలకొ న్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏబీఎస్ఎఫ్, బీఎస్ఎఫ్, స్వేరోస్ ప్రతినిధులు సాంఘిక సంక్షేమ గురుకులాల సెక్రటరీ శారదకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, శనిగరపు రాజేంద్ర ప్రసాద్, కడపక రాజేందర్ మాట్లాడుతూ నర్సంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం లేకపోవడంతో పాటు, డైనింగ్ హాల్ శిథిలావస్థలో ఉండడం వల్ల విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. ఇనుగుర్తి బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థినులు, ఉద్యోగులను మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్‌పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకులాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసి ఖాళీ సీట్లు, పోస్టులను భర్తీ చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సెక్రటరీ శారద హామీ ఇచ్చారు.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ఆందోళన

- ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

**అక్షరదర్బార్, నడికూడ :**



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ నడికూడ మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద గురువారం కాంగ్రెస్ నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పర్నెం మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ, నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులకు మద్దతుగా గొంతెత్తిన రాహుల్ గాంధీని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టును ఖండించిన నాయకులు

- బస్టాండ్ సర్కిల్‌లో బీజేపీ శ్రేణుల నిరసన

**అక్షరదర్బార్, పరకాల :**

బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు పరకాల పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో గురువారం బస్టాండ్ సర్కిల్‌లో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర నాయకుడు డాక్టర్ పెసరు విజయచంద్రరెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ చేపట్టిన నిరసన బాధ్యతారాహిత్యమని విమర్శించారు. నాంపల్లిలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామ్‌చంద్రరావును పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా, మండల, పట్టణ నాయకులు, ప్రజాప్రతినిధులు, మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బంద్‌ను విజయవంతం చేయాలి

- పరకాల కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ అవగాహన

**అక్షరదర్బార్, పరకాల**

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ, వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న నేటి బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ గురువారం పరకాల ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ హేమంత్, పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్ మాట్లాడుతూ ఢిల్లీలో జరిగిన ఘటనపై పారదర్శక విచారణ జరిపించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, ఎన్‌టీఏను రద్దు చేసి, వీబీఎస్ఏ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కళాశాల అధ్యక్షుడు దొమ్మటి విశ్వంత్, ప్రధాన కార్యదర్శి బన్నీ, రేవంత్, మహేష్, వినయ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# నేల ఆరోగ్యమే.. మన ఆరోగ్యానికి భరోసా

**ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన**

**అక్షరదర్బార్, పరకాల**



ఎన్ఎంఎన్ఎఫ్ పథకం కింద పరకాల మండలం నాగారం గ్రామంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం వల్ల భూమి సారాన్ని కోల్పోయి నిస్సారంగా, చౌడుగా మారుతోందన్నారు. అధికంగా రసాయన ఎరువులు వినియోగించిన భూముల్లో పండే పంటలు కూడా విషపూరితంగా మారే ప్రమాదం ఉందని, వాటిని ఆహారంగా తీసుకోవడం వల్ల మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వినియోగంపై ఆసక్తి చూపాలని సూచించారు. నేల, పంటలు, జీవజాతుల ఆరోగ్య పరిరక్షణ రైతుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓలు కాటంరాజు, వంగరాజు, తిరుపతి, అరుణ, కిరణ్‌తో పాటు రైతులు మార్క మునిరాజు, తిరుపతి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో బీజేపీని అడ్డుకోలేరు

- బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్
- చిట్యాలలో కాంగ్రెస్ తీరుపై బీజేపీ ఆగ్రహం
- వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఖాయం

**అక్షరదర్బార్, చిట్యాల :**



అక్రమ అరెస్టులతో బీజేపీ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని ఆ పార్టీ చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. గురువారం చిట్యాల మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టాలని నిర్ణయించుకోగా, పోలీసులతో అక్రమంగా అరెస్టు చేయించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు చీదరించుకునే పరిస్థితి ఏర్పడిందని, 50 ఏళ్ల పాలనలో దేశాన్ని కుంభకోణాలతో లూటీ చేశారన్నారు. రాహుల్ గాంధీ తన ఉనికి కోసం ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద నిరసన తెలపడం సిగ్గుచేటన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, సీనియర్ నాయకులు గుండా సురేష్, మండల ఉపాధ్యక్షులు చింతల రాజేందర్, పెరుమండ్ల రాజు, కేంసారపు ప్రభాకర్, సాద సదానందం, పరకాల రఘు, మణికుమార్ పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తే దేశానికి పునాది

- తాడిచెర్ల గ్రామ యువత

**అక్షరదర్బార్, మల్హర్ :**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపడుతున్న ఉద్యమానికి మద్దతుగా తాడిచెర్ల గ్రామ యువత గురువారం శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావాలని, పరీక్షల నిర్వహణను పక్కాగా చేపట్టాలని కోరుతూ ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్, కిరణ్ తదితరులు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తే దేశ భవిష్యత్తుకు పునాది అని, పరీక్షల నిర్వహణ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇందరపు విష్ణువర్ధన్, ఇందరపు కిరణ్, ఇందరపు డేవిడ్ రాజు, ఇందరపు మహేందర్, ఇందరపు కుమార్, కదారి పవన్ కళ్యాణ్, మోతే దీక్షిత్, రొడ్డ ఈశ్వర్, సందేశ్, అన్వేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన గురుకులాల్లో ఖాళీ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

- ప్రాంతీయ సమన్వయ అధికారి వెంకన్న
- ఈ నెల 27న నేరుగా స్పాట్ అడ్మిషన్ల నిర్వహణ
- 5 నుండి 9వ తరగతి ఖాళీల భర్తీకి ప్రకటన

**అక్షర దర్బార్, వరంగల్**

తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని వరంగల్ జిల్లా పాఠశాలల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గానూ ఖాళీగా ఉన్న 5వ తరగతి నుండి 9వ తరగతి వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారి డి.ఎస్. వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన గిరిజన విద్యార్థులకు ఈ నెల 27-07-2026న నేరుగా కౌన్సిలింగ్ నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. వరంగల్, నర్సంపేటలోని గిరిజన సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాలల్లో ప్రవేశాలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ టీసీ ఒరిజినల్, (04) పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో పాటు (02) సెట్ల కుల, ఆదాయ ధృవీకరణ జిరాక్స్ ప్రతులను తీసుకుని గిరిజన సంక్షేమ గురుకుల (బాలుర) పాఠశాల, యాకూబ్‌పురా (వరంగల్) నందు ఈ నెల 27-07-2026 ఉదయం 10:00 గంటలకు నేరుగా హాజరుకావాలని కోరారు.



# కేటీఆర్ కొందరివాడేనా..?

- బీఆర్ఎస్ పార్టీకి కొంతమంది జర్నలిస్టులే అవసరమా..?
- వరంగల్ ప్రెస్ అండ్ మీడియాలో వర్గీకరణ..!
- పెద్ద, మధ్య, చిన్న పేపర్లుగా తారతామ్యాల సృష్టి
- తాబేదార్లు చెప్పినట్లే నడుచుకుంటున్న పీఆర్వోలు, లీడర్లు
- పబ్లిక్ లీడర్ చిట్‌చాట్‌ను సైతం ప్రైవేటు ప్రోగ్రాంలా నిర్వహణ
- నిజాలు రాసేటోళ్ల కన్నా.. తాబేదార్లే ముఖ్యమా..?
- స్ట్రీం ముసుగులో జోకొడుతున్నదెవరు..?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యటనపై కొంతమందికే సమాచారం
- చిట్‌చాట్‌కు సైతం వారికే ఆహ్వానం.. ఇలా అయితే ఎలా సారూ..?
- అర్థం చేసుకోకుంటే ఆగమవడం గ్యారంటీ అంటూ మీడియా వర్గాల్లో చర్చ

**అక్షరదర్బార్, హనుమకొండ**



బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వరంగల్ పర్యటనలో మీడియాపై పార్టీ నిర్వాహకులు అనుసరించిన విధానంపై మీడియా అండ్ ప్రెస్ వర్గాల్లో కొత్త చర్చకు దారితీస్తోంది. బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యటనపై..చిట్‌చాట్ నిర్వహణపై కొంతమందికే సమాచారం ఉండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ జిల్లా నాయకత్వం అనుసరించిన తీరుపై స్థానిక జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కేవలం కొద్దిమందికే పార్టీ కార్యక్రమాలను పరిమితం చేస్తూ, నాయకులు అనుసరిస్తున్న ఏకపక్ష ధోరణిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. అసలు కేటీఆర్ కేవలం కొందరివాడేనా, లేక బీఆర్ఎస్ పార్టీకి కేవలం కొంతమంది ఎంపిక చేసిన జర్నలిస్టులు మాత్రమే అవసరమా? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ, మీడియా వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

### వర్గీకరణ పేరుతో తారతమ్యాలు

వరంగల్ ప్రెస్ అండ్ మీడియా రంగంలో కావాలనే కొందరు వ్యక్తులు వర్గీకరణకు తెరలేపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్ద, మధ్య, చిన్న పేపర్లు అంటూ పత్రికల మధ్య తారతమ్యాలు సృష్టిస్తూ వివక్ష చూపుతున్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజల గొంతుకగా నిలిచి నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే నిజమైన జర్నలిస్టులను కావాలనే పక్కన పెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. కేవలం కొందరి స్వార్థ ప్రయోజనాల కోసమే ఈ తరహా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని, ఇది పార్టీకి ఏమాత్రం మంచిది కాదని హితవు పలుకుతున్నారు. ప్రజాస్వామ్యంలో అందరికీ సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన పార్టీ నేతలు, ఇలా ఒక వర్గానికి వత్తాసు పలకడం దారుణమని మండిపడుతున్నారు.

### తాబేదార్ల కనుసన్నల్లోనే పీఆర్వోలు, లీడర్లు

నాయకుల చుట్టూ చేరిన కొందరు తాబేదార్లు ఆడించినట్లే పీఆర్వోలు, పార్టీ లీడర్లు గుడ్డిగా నడుచుకుంటున్నారని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రతినిధులుగా, బాధ్యత గల పబ్లిక్ లీడర్లుగా ఉండాల్సిన వారు నిర్వహించే చిట్‌చాట్‌లను సైతం కొద్దిమందికి మాత్రమే పరిమితం చేసి ఏదో ప్రైవేటు ప్రోగ్రాంలా నిర్వహిస్తుండటంపై విస్మయం వ్యక్తమవుతోంది. క్షేత్రస్థాయి వాస్తవాలు రాసే నిజమైన జర్నలిస్టులను విస్మరించి, కేవలం తమకు అనుకూలంగా వ్యవహరిస్తారనుకునే వాళ్లకే లీడర్లు పెద్దపీట వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇలాంటి సంస్కృతి వల్ల పార్టీకి మైలేజ్ రావకపోగా, క్షేత్రస్థాయిలో తీవ్రమైన నష్టం జరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

### స్ట్రీమ్ ముసుగులో లబ్ధి పొందుతున్నదెవరు..?

... స్ట్రీమ్ ముసుగులో కొందరు జర్నలిస్టులు, వ్యక్తులు పార్టీ పెద్దలను తప్పుదోవ పట్టిస్తూ తమ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తుండటం గమనార్హం. స్వార్థపరులను నెత్తికెత్తుకుని ప్రోత్సహిస్తే భవిష్యత్తులో తీవ్ర మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పార్టీ నాయకులను హెచ్చరిస్తున్నారు. అందరినీ సమానంగా ఆదరించాల్సిన నాయకులు, ప్రెస్ అండ్ మీడియా బాధ్యులను ఇలా వర్గాలుగా విడదీసి రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మండిపడుతున్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యటన సమాచారాన్ని కొద్దిమందికే పరిమితం చేయడం, చిట్‌చాట్‌ల పేరుతో గోప్యంగా వ్యవహరించడం లాంటి చర్యలు పార్టీ పరువును బజారుకీడ్చుతున్నాయని హితవు పలుకుతున్నారు. ఇప్పటికైనా పార్టీ నేతలు తమ పద్ధతులు మార్చుకోకపోతే, మీడియా వ్యతిరేకులుగా సంబంధిత లీడర్లకు చెడ్డపేరును సొంత చేసుకోక తప్పదని మీడియా వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికి వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోకుంటే పూర్తిగా ఆగమవడం గ్యారంటీ ఖాయమంటూ మీడియా వర్గాల్లో తీవ్రమైన హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

అక్షర దర్బార్
తెలుగు దినపత్రిక
నిజం మా లక్ష్యం.. ప్రజలే మా శక్తి..
నిజానికి నిలబడే స్వరం...
ప్రజల పక్షాన అక్షర యుద్ధం!
మా ప్రత్యేకతలు
నిష్పక్షపాత వార్తలు
ప్రజా సమస్యలపై లోతైన కథనాలు
విచారణాత్మక విశ్లేషణలు
ప్రజా స్వరం.. మా ధ్యేయం
స్థానికం నుంచి రాష్ట్రం వరకు
ఎందుకు చదవాలి?
✔ నమ్మదగిన సమాచారం
✔ వాస్తవాలకు దగ్గరైన కథనాలు
✔ ప్రజల సమస్యలకు ప్రాధాన్యం
✔ అభివృద్ధి, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి
✔ సమాజానికి దోహదపడే అక్షర యాత్ర
మీ స్వరం... మా అక్షరం... మన భవిష్యత్తు!
ఈరోజే చదవండి..
రేపటికి ముందుండండి..
అక్షర దర్బార్
మీ ఇంటికి.. మీ చేతిలోకి!
QR స్కాన్ చేసి ఈ-పేపర్ చదవండి
చదవండి ఆలోచించండి అక్షర దర్బార్ తో ముందుకు సాగండి
వివరాలకు సంప్రదించండి 7680992278
మమ్మల్ని అనుసరించండి
www.aksharadarbar.com
info@aksaradarbaar.com

